రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# ఎలాంటి పరిస్థితుల్లోనూ నిరాశ వద్దు



ఏఆర్ దర్బార్‌లో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహా మెహ్రా

**కలసిమెలసి పనిచేద్దాం**
**డ్యూటీలో ఓపిక.. సహనం ఉండాలి**
**సమస్యలుంటే నేరుగా నాకు చెప్పండి**
**ఎలాంటి సంకోచం వద్దు**
**వ్యక్తిగత జీవితం, విధి నిర్వహణ మధ్య సమతుల్యత అవసరం**
**ఆత్మవిశ్వాసమే మన ఆయుధం**
**ఏఆర్ దర్బార్‌లో ఎస్పీ హితవు**
**పోలీస్ సిబ్బందితో ముఖాముఖి భేటీ**

పోలీస్ అంటే కేవలం ఖాకీ డ్రెస్ కాదు.. అదొక బాధ్యతాయుతమైన కుటుంబం అని ఎస్పి స్నేహ మెహ్రా పేర్కొన్నారు. కేవలం విధులకు సంబంధించిన అంశాలే కాకుండా, పోలీస్ శాఖలో సిబ్బంది వ్యక్తిగత, కుటుంబ సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. వారికి తగిన దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మహిళా పోలీసుల నైపుణ్యాన్ని పెంచేలా డ్రైవింగ్ శిక్షణ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రకటిస్తూ, సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఇబ్బందులకు వెరవకుండా, ఆత్మవిశ్వాసంతో సమాజానికి రోల్ మోడల్స్‌గా నిలవాలని మహిళా సిబ్బందికి పిలుపునిచ్చారు.

**వికారాబాద్, ప్రభాతవార్త :** సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రజలకు న్యాయం చేసే దిశగా ముందుకు వెళ్ళాలని జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫీల్డ్ లెవల్‌లో విధులు నిర్వహించేటప్పుడు ఎదురయ్యే ఇబ్బందులు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలను ఆమె ఓపికగా విన్నారు. వాటి పరిష్కారానికి సంబంధించి తక్షణమే అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మనం అందరం ఒకే కుటుంబం, అందరం కలసిమెలసి సమన్వయంతో విధులలో పాల్గొని ప్రజలకు మంచి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓపికగా, సహనంతో, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు.

**మానసిక దృఢత్వం చాలా ముఖ్యం**

పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ ఓపికతో, సహనంతో ఉండాలని.. మానసిక ధైర్యాన్ని, శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వృత్తిపరమైన ఒత్తిడిని జయించడానికి వ్యక్తిగత జీవితానికి విధులకు మధ్య సమతుల్యత పాటించాలని కోరారు.

**మహిళా పోలీసులకు ప్రత్యేక నైపుణ్యం**

ముఖ్యంగా మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది ధైర్యంగా ముందడుగు వేయాలని ఎస్పీ సూచించారు. వ్యక్తిగత జీవితంలో కానీ, వృత్తిపరంగా కానీ ఎదురయ్యే సవాళ్లకు అధైర్యపడకూడదు. ఆత్మవిశ్వాసంతో సమాజానికి రోల్ మోడల్‌గా నిలవాలి అని ఆమె పిలుపునిచ్చారు.

**మహిళా సిబ్బందికి డ్రైవింగ్‌లో శిక్షణ**

మహిళా సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి వృత్తిపరంగా మరింత వెసులుబాటు కల్పించేందుకు త్వరలోనే డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని ఎస్పీ వెల్లడించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా ధైర్యంగా ముందుకు సాగాలని, సూచించారు.

**సమస్యలను సహచరులతో పంచుకోండి**

వృత్తి పరమైన, కుటుంబ పరమైన గానీ సమస్యలు ఎదురైనప్పుడు వాటిని మనసులో పెట్టుకోకుండా తమ సహచరులతో, స్నేహితులతో లేదా ఉన్నతాధికారులతో పంచుకోవాలని తెలిపారు. సమస్యలు మరింత తీవ్రమైన స్థాయికి చేరుకుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ తెలిపారు.

**సిబ్బంది సంక్షేమం కోసం ముందుంటా**

పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి పోలీస్ సిబ్బంది వ్యక్తిగత జీవితం విధి నిర్వహణ మధ్య సమతుల్యత పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు.

**ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ**

పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

**క్రమశిక్షణే ముఖ్యం**

విధుల పట్ల అంకితభావం, క్రమశిక్షణ, సేవా దృక్పథం కలిగి ఉండాలని ఎస్పీ హెచ్చరించారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం లేదా ఆశలకు లోబడి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. అక్రమ మార్గాల్లో వెళ్లి తమ జీవితాలను, కుటుంబ గౌరవాన్ని నాశనం చేసుకోవద్దని ఆమె వార్నింగ్ ఇచ్చారు.

జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి వీరేష్, ఆర్ఐ శ్రీశైలం, ఆర్ఎస్ఐ లు, ఏఆర్ఎస్ఐ లు, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో మహిళ అనుమానాస్పద మృతి

**జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ మే 14, ప్రభాతవార్త:** ఓ లేడీస్ హాస్టల్ టెర్రస్ పైన ఉన్న బాత్ రూమ్‌లో ఒక మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ అర్బన్ ప్రాంతానికి చెందిన ఇడుపల్లి హరిత (36) పదేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చింది. మెహిందీ పెట్టడం తదితర పనులు చేసుకుంటూ, మధురానగర్ లోనీ భార్గవి లేడీస్ హాస్టల్ టెర్రస్లో నివసిస్తుంది. ఆమె థైరాయిడ్ సమస్యతోపాటు ఊబకాయం సమస్య తో బాధపడుతున్నట్టు ఆమె తల్లి తెలిపారు. మూడు రోజుల కిందట ఆమెకు అనా రోగ్యంగా ఉందని తల్లి పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం భార్గవి లేడీస్ హాస్టల్ ఓపెన్ టెర్రస్పై ఉన్న బాత్రూంలో దుర్వాసన వస్తుందని వెళ్లి చూడగా బాత్ రూమ్‌లో హరిత విగత జీవిగా పడి ఉంది.

# అనధికారిక క్లినిక్‌లపై కొరడా

**★నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆసుపత్రులు సీజ్ ★కఠిన చర్యలు తప్పవు : వైద్య అధికారి**



అనుమతులు లేని ఆస్పత్రులను సీజ్ చేస్తున్న మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి, వైద్య అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 14, ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న క్లినిక్‌లపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న క్వాక్ సెంటర్లపై దాడులు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆసుపత్రులను సీజ్ చేశారు. ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, కనీస వైద్య అర్హతలు లేని వ్యక్తులు క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి నేతృత్వంలోని బృందం గురువారం ఆకస్మిక దాడులు చేపట్టింది. కెపిహెచ్‌బి, జగద్గిరిగుట్ట పరిధిలో నిర్వహించిన ఈ తనిఖీలలో ఎటువంటి చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ లేని కేంద్రాలుగా గుర్తించిన సుమన్ క్లినిక్, శ్రీ గాయత్రి క్లినిక్, సుమన్ హెల్త్ అండ్ రిహాబ్ సెంటర్ క్లినికల్‌లను సీజ్ చేసి ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, ఆలోపతి చట్టం 2010 ప్రకారం చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ, కొందరు వ్యక్తులు ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఎలాంటి అర్హత లేకుండా రక్త, మూత్ర నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపడం, ఫార్మసీలను ఏర్పాటు చేసి అధిక ధరలకు మందులు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్య సేవలు కేవలం అర్హత కలిగిన డాక్టర్ల ద్వారానే అందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి, ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమాలలో జిల్లా వైద్య అధికారులు డాక్టర్ గీత, డాక్టర్ పవన్, డిప్యూటీ డెమో వసంత తదితరులు పాల్గొన్నారు.

# చదరపు గజానికి లక్ష

**◗రోడ్డు విస్తరణలో భూనిర్వాసితులకు నష్టపరిహారం ◗మొదటి విడతగా రూ.103కోట్ల చెక్కులు పంపిణీ ◗ధర నిర్ణయంలో కలెక్టర్ చొరవపై రైతుల హర్షం**



భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంగా చెక్కులను ప్రజాప్రతినిధులకు అందజేస్తున్న కలెక్టర్

**శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), మే 14, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు రాజీవ్‌రహదారిన ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం కోసం ఈ రోడ్డు విస్తరణ (వెడల్పు)లో భూములు, స్థలాలు కోల్పోతున్న రైతులకు, యజమానులకు నష్టపరిహారంగ చెక్కులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి అందజేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో శామీర్‌పేట మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన పలువురు రైతులు, స్థలాల యజమానులు ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్నందున వారిని గుర్తించి చెక్కులను కలెక్టర్ అందజేశారు. దీనికి సంబంధించి తూంకుంటలో పలువురు రైతులు, రోడ్డు పక్కన గల స్థలాలు ఉన్నవారు యజమానులు 24ఎకరాలకు మొదటి విడతగా 14,203 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన రైతులకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ మనుచౌదరి 103కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ మొదటి దఫాగ ఈ చెక్కులు అందించటం జరిగిందని, మిగిలిన వారికి తరువాత అందించటం జరుగుతుందన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. తమ భూమికి చదరపు గజానికి లక్ష రూపాయలు ధర నిర్ణయించటంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకున్నారని బాధితులు రైతులు, స్థలాల యజమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా భూసేకరణ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి పాల్గొన్నారు. చెక్కులు పొందిన వారిలో రైతు, స్థలాల యజమానులు తూంకుంట గ్రామ మాజీ సర్పంచి బి.దయాసాగర్‌యాదవ్, సంజయ్ అగర్వాల్, విజయలక్ష్మి, సతీష్, పద్మప్రసాద్, అరుణ తదితరులు ఉన్నారు. ఆ తరువాత జిల్లా కలెక్టర్ మనుచౌదరిని వారు సన్మానించి దన్యవాదాలు తెలియజేశారు.

# ధాన్యం దిగుమతి త్వరగా పూర్తవ్వాలి

**రైస్ మిల్లర్లు, లారీల యజమానులతో సమన్వయం చేసుకోండి**

**అధికారులకు కలెక్టర్ దీపక్ తివారీ దిశా నిర్దేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో వరి కొనుగోళ్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యంను కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరగాలని, ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని అన్నారు.

కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి జిల్లాలో గుర్తించిన గోదాములలో నిల్వ చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం దెబ్బతినకుండా గోదాములలో నిల్వ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో లారీలు, హమాలీల కొరత, సమస్య లేకుండా ధాన్యం దిగుమతి త్వరగా పూర్తిచేసే విధంగా రైస్ మిల్లులు, లారీల యజమానులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

కొనుగోలు, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, టోకెన్లు ఉన్న వారికి గన్ని బ్యాగులు అందజేయాలనీ, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి ఎం.మోహన్ కృష్ణ, డిసిఓ సుదర్శన్, వ్యవసాయ అధికారి రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

**తాండూరు, మే 14, ప్రభాతవార్త :** విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తాండూరు పట్టణంలోని ప్రభుత్వ నెం.1 పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యావారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విద్యా వారోత్సవాలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. ఏఐ,

## సర్కారు బడుల్లోనూ సాంకేతిక చదువులు

**ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం**

**విద్యా వారోత్సవాల్లో కలెక్టర్ దీపక్ తివారి**

ఏఎక్స్ఎల్ తరగతులు, ఎఫ్ఎల్ఎన్ విధానం, ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు, బడి బాట పలు సంస్కరణలతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు.

జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 100కు పైగా ఫ్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించడం జరిగిందని, ఈ ఏడాది మరిన్ని పాఠశాలలు ప్రారంబించనున్నట్లు తెలిపారు. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో 79శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది 91శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందని, వచ్చే ఏడాది 100శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ప్రజా ప్రతనిధులు సహకరించాలని కోరారు.

# మెట్రో రెండో దశకు సమాయత్తం

**అనుమతుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మెట్రోరైల్ రెండో దశకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. మెట్రోరైల్ మొదటి దశను స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండో దశ పనులను కూడా ప్రారంభించడం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోరైల్ మొదటి దశ ప్రాజెక్ట్‌లో వందశాతం ఈక్విటీ వాటాను తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. దీంతో రెండోదశ ప్రారంభానికి మార్గమం సుగమమైంది. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లను కేంద్రానికి పంపించి కూడా దాదాపు ఒకటిన్నర సంవత్సరాలు గడుస్తోంది. గతంలోనే కేంద్రానికి డీపీఆర్‌లు పంపినప్పటికి కేంద్రం మెలికలు పెడుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశను అలాగే కొనసాగిస్తూ రెండవ దశను మాత్రం నిర్వహించాలనుకున్నట్లు తెలుస్తోంది. మెట్రోరైల్ రెండవ దశ అనుమతి పొందాలంటే మెట్రోరైల్ ఆపరేషన్ పరంగా సమన్వయం కోసం మొదటిదశ ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీతో కచ్చితమైన ఒప్పందం చేసుకోవాలని కేంద్రం మెలిక పెట్టింది. కాగా ఎల్అండ్‌టీ కచ్చితమైన ఒప్పందం చేసుకోడానికి అంగీకరించలేదు. అంతే కాకుండా అవసరమైతే మొదటి దశ మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వానికి స్వాధీనం చేసేందుకు సిద్ధమని ప్రకటించింది. ఎట్లాగు మెట్రోరైల్ రెండవ దశకు కేంద్రం అనుమతించడం లేదని భావించి ప్రభుత్వం మొదటి దశను స్వాధీనం చేసుకోడానికి సిద్దపడింది. మెట్రోరైల్ మొదటి దశను స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండో దశ పనులను కూడా ప్రారంభించడం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పుడు ఎల్అండ్‌టీ నుంచి మెట్రోరైల్ సర్కారు చేతికి రావడంతో కేంద్రం అభ్యంతరాలు తొలగిపోయినట్లైంది. మెట్రోరైల్ స్వాధీనం చేసుకున్న విషయాన్ని నివేదించి రెండవ దశ మెట్రోరైల్‌కు సత్వరం అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. ఇప్పటికే స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల దృష్టికి స్వయంగా తీసుకెళ్లడంతో రెండవ దశకు వేగంగా కదలిక జరుగుతోంది.

**రెండో దశకు ప్రతిపాదనలు....**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో రూ. 24వేల 269 కోట్లతో ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేరకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింది రూ. 7వేల 313కోట్లు, కేంద్రం వాటాకింద రూ. 4వేల 230 కోట్లు, అలాగే పీపీపీ ద్వారా రూ. 1వేయ్యి 33 కోట్లుగా అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలో మియాపూర్ నుంచి పటాన్‌చెరు 13.4 కిలో మీటర్లు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ 7.1కిలో మీటర్లు, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట 7.5కిలోమీటర్లు, నాగోల్ నుంచి శంషాబాద్ 36.8కిలో మీటర్‌లు, రాయదుర్గం నుంచి కోకాపేట 11.6కిలో మీటర్‌లు రెండో దశ (ఏ)లో భాగంగా పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. అలాగే రెండో దశ (బి)లో భాగంగా మూడు కారిడార్లలలో 86.1 కిలో మీటర్‌లకు ప్రతిపాదించారు. ఇందుకోసం రూ. 19వేల 579 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్రం వాటాకింద రూ. 3వేల 524కోట్లు, రాష్ట్రం వాటాకింద రూ. 5వేల874 కోట్లుగా రుణ సేకరణ కోసం రూ. 9వేల 398కోట్లుగా అంచనా వేశారు. అలాగే పీపీపీ ద్వారా రూ. 783కోట్లుగా ప్రతిపాదనలో పేర్కొన్నారు.

## పకడ్బందీగా చేప ప్రసాదం

**ఏర్పాట్లపై మంత్రి పొన్నం ఆదేశం**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటీ శ్రీహరి, అజారుద్దీన్, కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు

**హైదరాబాద్, మే 14,ప్రభాతవార్త:** మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో చేప ప్రసాదం పకడ్బందీగా జరగాలని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడా లని మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు వాకిటి శ్రీహరి, మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, బత్తిని కుటుంబ సభ్యులతో కలిసి సమీక్షి ంచారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 179 సంవత్సరాలుగా ప్రజల విశ్వాసం, నమ్మకంగా కొనసాగుతున్న చేప ప్రసాదం కార్యక్రమం హైదరాబాద్ నగర ప్రత్యేకతగా నిలిచిందన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా వేలాది మంది భక్తులు, ఆస్తమా బాధితులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, ఈసారి సుమారు లక్షలాది మంది ప్రసాదం స్వీకరించే అవకాశం ఉందన్నారు. గత అనుభవాలను సమీక్షి ంచిలో పాలను సరిదిద్దుకుంటూ ఎటువంటి అవాంఛనీ య ఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భారీ జన సామర్థం దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణ, క్రౌడ్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని సూచించారు. పిక్‌పాకెటింగ్, చోరీలు, చైన్ స్నా చింగ్, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో రాత్రంతా పూర్తి స్థాయి లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అవసరమైన మందులు, సీపీఆర్ శిక్షణ పొందిన వైద్య సిబ్బంది, వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



## జిల్లెడు చౌదరిగూడలో బడిబాట ర్యాలీ

**జిల్లెడు చౌదరిగూడ, మే 14, ప్రభాతవార్త:** పాఠశాలలో చదువుతున్న పిల్లల ఉజ్వల భవిషత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేయాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని అన్నారు. పిల్లల తల్లిదండ్రులు ప్రైవేటు మోజులో పడి డబ్బులు వృదా చేసుకోవద్దని పేర్కొన్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలిచిన శివలీలకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణ రూ.10వేలు, రెండవ స్థానంలో నిలిచిన నవీన్‌గౌడ్‌కు రూ.10వేలు అందజేసినట్లు హెచ్ఎం సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, సర్పంచ్‌లు చంద్రశేఖర్, రాంచంద్రయ్య, ఉప సర్పంచ్ అజ్జు, ఉపాధ్యాయులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.



క్యూఎన్‌ఎక్స్ ఈ హ్యాక్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

## జాతీయ స్థాయి పోటీల్లో అనురాగ్ విద్యార్థుల ప్రతిభ

**ఘట్‌కేసర్ రూరల్, మే 14, ప్రభాతవార్త:** ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యూఎన్ఎక్స్ ఈ హ్యాక్ పోటీల్లో అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రథమ బహుమతి లభించింది. క్యూఎన్ఎక్స్ పై స్క్వేర్ టెక్నాలజీస్ సంయుక్తంగా హైదరాబాద్ క్యూఎన్ఎక్స్ క్యాంపస్‌లో నిర్వహించిన ఈ హ్యాక్ 2026 జాతీయ స్థాయి పోటీలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుపొందారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా దాదాపు 250 బృందాలు నమోదు చేసుకోగా హైదరాబాద్‌లో 33 బృందాలు పాల్గొన్నాయి. పది బృందాలు ఫైనల్‌కు చేరగా అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొంది లక్షా రూపాయల నగదు పొందినట్లు తెలిపారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అర్చన మంత్రి, స్టాటజికల్ ఉపాధ్యక్షుడు అనురాగ్ పల్లా, డీన్‌లు విజయ్‌కుమార్, శ్రీనివాస్ చలపతి తదితరులు విద్యార్థులను అభినందించారు.



## నప్రభుత్వ భవనాల పనులకు చురుకుగా ఏర్పాట్లు

**మేడ్చల్, మే 14, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని కండ్లకోయలో కోర్టు కాంప్లెక్స్, సబ్ రిజిస్ట్రేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనాలకు కేటాయించిన 12 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు భవనాలకు 5 ఎకరాలు, రిజిస్టరేషన్ కార్యాలయానికి 3 ఎకరాలు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు 4 ఎకరాలు కేటాయించినట్లు వివరించారు. ల్యాండ్ డెవలప్ మెంట్‌కు త్వరలో టెండర్ పిలుస్తామన్నారు. ఈ పర్యటనలో కీసర ఆర్డిఓ రాజేష్ కుమార్, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, మేడ్చల్ డిప్యూటి కమిషనర్ సుధాంశు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం



**నందిగామ, మే 14, ప్రభాతవార్త :** నందిగామ మండలంలోని మేకగూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం సర్పంచ్ రమావత్ మారు రాజునాయక్, ఉప సర్పంచ్ ఎడ్ల శ్రీశైలం యాదవులు సన్మానించారు. గురువారం హై స్కూల్ హెడ్మాస్టర్ ఉమ మహేశ్వర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను సన్మానించారు. పదిలో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులైన 22 మంది విద్యార్థులకు ఇంటర్ లో అవసరమయ్యే పుస్తకాల నిమిత్తం పూర్తి ఖర్చులు భరిస్తానని సర్పంచ్ రమావత్ మారు రాజునాయక్ హామీ ఇచ్చారు. పాఠశాలలో పదిలో ప్రతిభ కనబరిచిన 5 మంది విద్యార్థులకు రూ.4 వేల చొప్పున రూ.20 వేల నగదును ఉప సర్పంచ్ శ్రీశైలం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పందుల స్వైర విహారంపై చర్యలు తీసుకోవాలి

**తలకొండపల్లి, మే 14, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో పందులు విచ్చల విడిగా తిరగడంతో వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దోకోరి సునీత ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. గురువారం నాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పడకల్ గ్రామంలో పందులు విచ్చలవిడిగా తిరగడంతో రోగాలకు గురయ్యే ప్రమాదం ఉందని, గ్రామం సమీపంలోని పంట పొలాలను సైతం నష్టపరుస్తున్నాయని, దానివల్ల ఎంతో నష్టపోవాల్సిన అవసరం వస్తుందని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని వారు ఆ వినతి పత్రంలో పత్రంలో కోరారు. గ్రామానికి దూరంగా ఖాళీ స్థలంలో దొడ్డి ఏర్పాటు చేసుకునే విధంగా వీలు కల్పించేందుకు గ్రామపంచాయతీ చొరవ తీసుకోవాలని వార్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దోకిరి సునీత ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి, ఉప సర్పంచ్ రాఘవేందర్, గ్రామస్తులు చెవిటి విజయ్ ,చందు, సిపిఎం గ్రామ కార్యదర్శి జె పెంటయ్య మల్లయ్య లక్ష్మయ్య శ్రీశైలం తిరుపతి పర్వతాలు తదితరులున్నారు.

## పెళ్లికి వెళుతున్నానని చెప్పి చెరువులో శవమై..
## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**నందిగామ, మే 14, ప్రభాతవార్త :** పెళ్లికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మోటార్ సైకిల్ పై వెళ్లిన విజయేందర్ (24) చెరువులో శవమై కనిపించిన సంఘటన నందిగామ మండలం ఈదులపల్లి నల్ల చెరువులో గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం. నందిగామ మండల కేంద్రానికి చెందిన ఏఎస్ఐ తినేటి లక్ష్మయ్య కుమారుడు విజయేందర్ బుధవారం ఉదయం మామిడిపల్లిలోని తమ బంధువుల వివాహానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మోటార్ సైకిల్ పై వెళ్లినట్లు తెలిపారు. మరుసటి రోజు ఉదయం గురువారం చెరువుగట్టుపై మోటార్ సైకిల్, దుస్తులు, ఫోన్ అగుపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. మోటార్ సైకిల్ ఫోన్ నెంబర్ ఆధారంగా పరిశోధించిన పోలీసులు నందిగామ గ్రామానికి చెందిన మృతుడు తినేటి విజయేందర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈత కోసం వెళ్ళాడా..? లేదా చేపలు పట్టడానికి వెళ్లి మృతి చెంది ఉంటాడా..? అన్ని కోణాల్లో విచారిస్తున్నామని ఇన్స్పెక్టర్ చెప్పారు. నందిగామ యువకుడు మృతి చెందారన్న సమాచారం తెలిసిన నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్,.వార్డ్ సభ్యులు శివగళ్ళ ప్రవీణ్ హుటాహుటిన ఈదులపల్లి గ్రామానికి వెళ్లి నల్లచెరువును సందర్శించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నందిగామ ఏఎస్ఐ గోపాల్ శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన వారిలో ఈదులపల్లి సర్పంచ్ సులోచన భర్త గణేష్ గౌడ్ ఉన్నారు. ఈ విషాదకర సంఘటనలో అటు మామిడిపల్లి.. ఇటు నందిగామలో తీవ్ర విషాదం అలుముకుంది.

## షాద్‌నగర్‌లో ఐఐటి, జెఇఇ, నీట్, సిఎ శిక్షణ

**షాద్‌నగర్, మే 11, ప్రభాతవార్త :** విద్యార్థులలో విజ్ఞానాన్ని వెలికి తీయటానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో విజ్డ్ డాక్టర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఐటీ జేఈఈ, నీట్, సిఏ శిక్షణ కళాశాలను ఆయన ప్రారంభించారు. నాణ్యమైన విద్యను, తక్కువ ఫీజులతో అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కళాశాల డైరెక్టర్, సీనియర్ జర్నలిస్టు మారం శ్రీనివాస్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందెమోహన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్ పెంటయ్య, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం

# ధాన్యం సేకరణలో ఎందకీ జాప్యం?

### అధికారులను నిలదీసిన కలెక్టర్

**కందుకూరు, మే 14, ప్రభాతవార్త :** ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి హెచ్చరించారు. కందుకూరు మండలంలోని వరి, మొక్కజొన్న కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించే యంత్రాలను, తూకం వేసే కాంటాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో జాప్యం ఎందుకు జరుగుతోందని వ్యవసాయ అధికారులను నిలదీశారు. లారీల ద్వారా లిఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మిల్లులకు తరలించే క్రమంలో ఎక్కడా అవకతవకలు జరగకూడదని ఆర్డీవో, తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షాల సూచన ఉన్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా తార్పాలిన్లు, నిల్వ చేయ దానికి సరిపడా గోనె సంచులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కేంద్రాల్లోనే మద్దతు ధర పొందేలా రశీదులు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాలలో ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ గోపాల్, మండల వ్యవసాయ అధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

# భూగర్భవంతెనతో రోడ్డు ప్రమాదల నివారణ

**ఘట్‌కేసర్ రూరల్, మే 14, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ అన్నోజిగూడ ఎన్‌టిపిసి చౌరాస్తా వద్ద వరంగల్ జాతీయ రహదారిపై భూగర్భవంతెన నిర్మాణ పనులు చేపట్టినందుకు స్థానిక నాయకులు ఎంపి ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిని ఆయన నివాసంలో గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ బిఆర్‌ఎస్ నాయకుడు బోయపల్లి కొండల్ రెడ్డి తదితరులు కలిశారు. అన్నోజిగూడ వద్ద వరంగల్ జాతీయ రహదారిపై గత కొన్ని సంవత్సరాలుగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయని చెప్పారు. ఆయా సందర్భాలలో పలువురికి తీవ్ర గాయాలు అవుతున్నాయని, ప్రాణాలు కోల్పోతున్న ఉదంతాలూ ఉన్నాయని తెలిపారు. అనేకసార్లు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. తాజాగా భూగర్భవంతెన నిర్మాణం చేపడుతుండటంతో రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమమైందన్నారు. ఎంపిని కలిసిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్‌తో పాటు బిజెపి డివిజన్ అధ్యక్షుడు సురేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, నాయకులు తౌర్యనాయక్, బిఆర్ఎస్ రాష్ట్ర గిరిజన నాయకుడు జితేందర్ నాయక్, నాయకులు బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, కొమ్ముల ప్రశాంత్, లక్ష్మణ్ యాదవ్, సంతోశ్ నాయక్, రాఘవేందర్‌రెడ్డి, తిలక్, మహేందర్, గాంధారి నవీన్, శేఖర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎంపి ఈటలకు కృతజ్ఞతలు చెబుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి తదితరులు



ఘట్‌కేసర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు

**ఘట్‌కేసర్, మే 14, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారని విద్యార్థులను చేర్పించాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమిరెడ్డి పాపిరెడ్డి కోరారు. ఘట్‌కేసర్ పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రూప్-1 శిక్షణ అధికారి విష్ణునందన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బడిబాట ర్యాలీని ప్రారంభించారు. సర్కారు పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్లమాధ్యమం, క్రీడల శిక్షణ, గ్రంధాలయం, ఉచిత పుస్తకాల పంపిణీ, యోగా, ప్రయోగశాల, అల్పాహారం, మధ్యాహ్నభోజనం తదితరులు సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో బాలికా శు అభివృద్ది అధికారిణి హేమలత, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, యశ్‌పాల్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

## జోరుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**ఘట్‌కేసర్, మే 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్దిదారులు పూర్తి చేసుకోవడంతో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో ఇళ్లలో పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి ఇళ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా విచ్చేసిన నాయకులను శాలువాలతో సన్మానించి మిఠాయి తినిపించారు. అనంతరం నాయకులు తిరుమలయ్యబండ వద్ద వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2.389, సాధారణ రకం రూ.2,369లకు ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు రైస్ మిల్లర్లకు వద్దకు వెళ్లకుండా ధాన్యం కేంద్రంలోనే వద్దు విక్రయించాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు-కీసరగుట్ట డైరక్టర్ సామల అమరేందర్, సహకార సంఘం డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బింగి రాజేందర్‌గౌడ్, మెట్టు నర్సింహ్మా, బొంత రాజిరెడ్డి, సొసైటీ మాజీ డైరక్టర్ జవాజి సత్తయ్య, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు ఎండి.ఇక్బాల్, మాజీ ఉపసర్పంచ్ ఆకిటి సుధాకర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు మెట్టు రమేశ్, బింగి సురేశ్‌గౌడ్, సింగారం సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చేయూత



**తలకొండపల్లి మే 14, ప్రభాతవార్త :** ఆర్థిక స్తోమత లేని కుటుంబాలకు వ్యక్తి గతంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని లింగ రావు పల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని వీరవల్లి గ్రామానికి చెందిన టేకూరి రత్నమ్మ గణేష్ కుమార్తె వివాహానికి రూ.10 వేలుఅందజేశారు.

## బాధ్యతలు స్వీకరించక ముందే ..
## మహిళా కమిషన్ చైర్‌పర్సన్ దూకుడు!

**బేగంపేట మే 14,ప్రభాతవార్త :** తెలంగాణా రాష్ట్ర మహిళా కమీ షన్ ఛైర్ పర్సన్‌గా నియమితురాలైన గద్వాల విజయలక్ష్మి మరో సారి బాధ్యతలు చేపట్టకముందే స్పందించి తనదైన శైలిని ప్రదర్శించారు. అధికారికంగా బాధ్యతలు స్వీకరించడానికి ముందే మహిళల సమస్యల పరిష్కారంపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. లైంగిక వేధింపులకు గురి అయిన ఒక విద్యార్థిని అనారోగ్య కారణాలతో ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ లో కళాశాలకు గైర్హాజరైంది. దీంతో కళాశాల వారు తగిన (పర్సంటేజి) హాజరు లేదంటూ బాలికను పరిక్షలు రాయడానికి అనుమతి నిరాకరించారు.

ఈ విషయం తెల్సుకున్న గద్వాల విజయలక్ష్మి వెంటనే స్పందించి జేఎన్‌టీయూ అధికారులతో మాట్లాడి బాలికకు జరిగిన వేధింపులు, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో పరిక్షలు రాసేందుకు బాలికకు అవకాశం కల్పించాలంటూ కోరారు. దీంతో స్పందించిన జేఎన్‌టీయూ అధికారులు బాలికకు తగిన న్యాయం జరిగేలా చూస్తామంటూ హామీ ఇచ్చారు. కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఉక్కపోతతో గర్భిణులు బాలింతలు ఇబ్బందులకు గురవుతున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనంపై కూడా గద్వాల విజయలక్ష్మి స్పందించారు. ఈ విషయాన్ని అక్కడి జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. మహిళలకు తగిన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం లేకుండా మహిళలను చూసుకోవాలంటూ సూచించారు.


బడిబాటలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

## చిన్నారుల ఉజ్వల భవితకు మాది బాధ్యత

**షాద్‌నగర్, మే 11, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఫరూక్‌నగర్ మండలం వెల్ జర్ల గ్రామంలో విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులను కోరింది. ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా చిన్నారుల ఉజ్వల భవితకు బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల ప్రజా పరిషత్ పాఠశాల హెచ్ఎం ఇమ్మానుయేల్, జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి రవి, సర్పంచ్ ఆర్ బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థి తమ్ములి నరసింహను సర్పంచ్ సన్మానించారు. కార్యదర్శి కావలి యాదయ్య, ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ కటికెల బలమణి తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డిగూడెం గ్రామంలో జరిగిన బడిబాటలో సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్ ఉపసర్పంచ్ అశోక్, విద్యా కమిటీ చైర్మన్ గడ్డం మాధవి, గ్రామ కార్యదర్శి రవిశంకర్, వార్డు సభ్యులు వి. మల్లేష్, ఎర్రోళ్ల మమత, అరుణ్, రంగంపల్లి శశాంక్, ఎండి మెహరాజ్, అంగన్వాడి ఉపాధ్యాయులు మంజుల, అమృత, మాజీ ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి, గంటల శంకరయ్య, రంగంపల్లి వీరేష్ గౌడ్, ఎండి ఫకీర్ భాష, పక్కనే చిన్న నరసింహులు, రవి, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.


నరేందర్‌రెడ్డిని పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నాం

**ఆమనగల్లు, మే14, ప్రభాతవార్త:** ప్రభుత్వ చేయూతతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికి సమప్రాధాన్యతనిస్తూ తెలంగాణ ప్రగతికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో కాంగ్రె ప్రధానమైన పాత్ర పోషించిందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంను బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఆశించిన ప్రగతి సాధించలేకపోయిందని విమర్శించారు.

**ఆకుతోటపల్లి సర్పంచికి కాంగ్రెస్ కండువా**

తొలుత ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి సర్పంచి (స్వతంత్ర) న్యాలపట్ల నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచితోపాటు గ్రామవార్డు సభ్యులు, వందలాదిమంది ఆయన అభిమానులు పెద్ద ఎత్తున అధికార పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వారికి కండువ కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ యాటగీతనర్సింహ్మా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మాముదిరాజ్, మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, మాజీ వైస్ ఎంపీపీ నిట్టనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు గుర్రం కేశవులు, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, అండేకర్ రాజశేఖర్ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నిట్టనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కోఆప్షన్‌మెంబర్ ఖాదర్, గుర్రం కేశవులు, బిక్యానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, అలీమ్, శ్రీకాంత్, ఫరీద్, విజయ్ తదితరులు ఉన్నారు.

## సమర్థవంతమైన బోధనతో ఉత్తమ ఫలితాలు

**కొందుర్గు, మే 14, ప్రభాతవార్త:** బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని స్థానిక సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ తల్లిదండ్రులను కోరారు. గురువారం నాడు స్థానిక బస్టాండ్ ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎంతో విద్యార్హతతో పాటు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని వారు విద్యార్థులకు ఎంతో చక్కగా బోధిస్తారని ఆయన అన్నారు. ప్రతి తల్లిదండ్రి వారి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీనాథ్, వార్డు సభ్యులు మద్ది శ్రీకాంత్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ, తహసీల్దారు

## వేగంగా ఎంపిడివో భవన నిర్మాణం

**జిల్లెడు చౌదరిగూడ, మే 14, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో నూతనంగ నిర్మిస్తున్న ఎంపిడిఓ భవన నిర్మాణ పనులను గురువారం ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు జగదీశ్వర్ పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం పనులు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రశేఖర్, రాంచంద్రయ్య, నాయకులు కృష్ణ. సత్యనారాయణరెడ్డి, అజ్జు తదితరులు ఉన్నారు.



## మెరిట్ విద్యార్థులకు అభినందన

**పూడూరు, మే 14, ప్రభాతవార్త :** క్రమశిక్షణతో చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సర్పంచ్ వీరేశం, ప్రధానోపాధ్యాయులు పుష్ప పేర్కొన్నారు. బడివాట కార్యక్రమంలో భాగంగా గురువారం పూడూరు మండలం పరిధిలోని కంకల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 546 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానం పొందిన జస్వంత్‌ను ఈ ఏడాది టెన్త్ పరీక్షలలో 8 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎపిసి చైర్మన్ సోని, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రజక ఫెడరేషన్ ఛైర్మన్‌కు సన్మానం

**మేడ్చల్, మే 14, ప్రభాతవార్త :** నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర రజక ఫెడరేషన్ ఛైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్‌కు రజక సంఘం నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, మేడ్చల్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర జత సంఘాల జెఏసి చైర్మన్ పంజాగారి అంజనేయులు, నాయకులు విట్టల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ మల్లేష్

## ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

**తలకొండపల్లి, మే 14, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్, జంగారెడ్డిపల్లి, పడకల్, పడమటి తండా, లంబాడీతండాలలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామపంచాయతీ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి, వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, మల్లేష్, శంకర్ నాయక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులున్నారు.

## మెదక్‌జిల్లా వ్యక్తి అదృశ్యం

**ఘట్‌కేసర్, మే 14, ప్రభాతవార్త:** పనికోసం మెదక్‌జిల్లా నుంచి వచ్చి ఘట్‌కేసర్‌లో అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా శాకంపేట్ మండలం సంగాయపల్లికి చెందిన శ్రీనివాస్ (40) నాలుగు రోజుల క్రితం పనికోసం ఘట్‌కేసర్ పడమటి సాయిగూడ రోడ్డులోని ఎల్ కన్వెన్షన్‌కు వచ్చాడు. పనిముగిసిన తర్వాత ఈనెల 12వ తేదీన రాత్రి 9 గంటలకు సమయంలో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో శ్రీనివాస్ భావమరిది గుత్తి నాగరాజు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



బడి బాటలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

## విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యం

**పెద్దేముల్, మే 14, ప్రభాతవార్త:** విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ డివై నర్సిములు అన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా సర్పంచ్ డివై నర్సిములు మాట్లాడుతూ బడిలోనే బాల్యం సురక్షితంగా ఎదుగుతుందని, అందుకు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు. నాణ్య మైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయా లని అన్నారు. ఉపసర్పంచ్ డివై ప్రసాద్, గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు సునీత, జడ్‌పిహెచ్ఎస్ జిహెచ్ఎం అక్కమ హదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్న పూర్ణ, విద్యాకమిటి చైర్ పర్సన్లు గౌసియా, ప్రమీల, పంచా యతీ కార్యదర్శి లాలప్ప, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌కు డీలక్స్ బస్సులు

**షాద్‌నగర్, మే 14, ప్రభాతవార్త :** ప్రయాణికుల సౌకర్యార్థం షాద్ నగర్ డిపోకు చెందిన రెండు డీలక్స్ బస్సులను ఆర్టీసీ అధికారులు సమకూర్చారు. ఈ సందర్భంగా అందుకు సంబంధించిన వివరాలను డిపో మేనేజర్ తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం జరిగిందని. సంబంధిత సర్వీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వివాహ వేడుకల్లో పాల్గొని ఆర్థిక సహాయాన్ని అందజేసిన కోల్కుంద సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ.

## గ్రామ అభివృద్ధి కోసం పని చేస్తా

**సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ**

**మోమిన్‌పేట్, మే 14, ప్రభాతవార్త:** గ్రామపంచాయతి ఎన్నికలలో హామీలను తూచా తప్పకుండా నేరవేర్చడం జరుగుతుందని మోమిన్‌పేట్ మండల పరిధిలోని కోల్కుంద గ్రామ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ తెలిపారు. గురువారం మహానగరంలోని టోలిచైకి ఫంక్షన్ హాలులో కోల్కుంద గ్రామానికి చెందిన షకీల్ వివాహానికి హాజరై 25,116 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండు మూడు దఫాలుగా గ్రామంలో ఎవరి వివాహం, శుభ, అశుభ కార్యాలు ఉన్నా, అనారోగ్యానికి గురైన వారికి కూడా ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వపరంగా నిధులు ఇవ్వకపోయినా నాస్వగ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం పని చేయడం నాకుటుంబం యొక్క పూర్వజన్మ సుకృతమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు ఖాసీం, మైనారిటీ పెద్దలు చోటిమియా, ఎజాజ్, తాజ్, బాబర్, మహమ్మద్, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## టివిఎస్ ఎక్సల్ బైక్‌ను ఆటో ఢీ

**ఘటనలో భార్య మృతి,భర్తకు గాయాలు**

**పూడూరు, మే 14, ప్రభాతవార్త :** టివిఎస్ ఎక్సల్ బైక్‌ను వెనుకాలనుండి ఆటో ఢీ కొట్టిన ఘటనలో భార్య మృతిచెందగా,భర్తకు తీవ్రగాయాలు అయిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామానికి చెందిన తలారి శంకరయ్య,తలారి మాణెమ్మ (55) భార్యభర్తలు.తమ సొంత టివిఎస్ ఎక్సల్ బైక్‌పై సొంత పనుల నిమిత్తం గురువారం వికారాబాద్‌కు వెళ్లి సాయంత్రం సుమారు 4-30గంటల ప్రాంతంలో వికారాబాద్‌నుండి స్వగ్రామం అంగడి చిట్టంపల్లికి వస్తుండగా మార్గమధ్యలో మన్నెగూడ పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ తన ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ వెనకాలనుండి టివిఎస్ ఎక్సల్‌బైకును ఢీకొట్టగా,బైక్‌పై ఉన్న తలారి శంకరయ్య,తలారి మాణెమ్మలకు తీవ్రగాయాలు అయ్యాయి.దీంతో చికిత్స నిమిత్తం ఇరువురి క్షతగాత్రులను వికారాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో తలారి మాణెమ్మ (55) మృతిచెందింది.మృతురాలి అల్లుడు తలారి రవి పిర్యాదు మేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ముస్తాబౌతున్న ఎన్కతల శనైశ్వర ఆలయం

**మోమిన్‌పేట్, మే 14, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో కొలువైన శ్రీ శనైశ్వర స్వామి వారి ఆలయం ఈ నెల 16న, రేపు అనగా శనివారం వైశాఖ మాస బహుళ అమావాస్యను పురస్కరించుకొని ముస్తాబు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు నరేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ శనైశ్వరుడి జన్మోత్సవం, అలాగే ఈ సంవత్సరం వైశాఖ మాస బహుళ అమావాస్య శనివారం రోజున రావడం చాలా విశేషమని అన్నారు. స్వామి వారికి 4 గంటలకు ప్రత్యేక పూజ, మంగళ స్నానం, అలంకరణ, మరియు ఉదయం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తైలాభిషేకాలు జరుగుతాయని, అలాగే స్వామి వారికి ప్రీతిపాత్రమైన నల్లని వస్త్రము, నువ్వుల నూనే, పూలు, పండ్లు, సమర్పించి వారా వారి కోర్కెలను తీర్చుటకొరకు స్వామి వారి సన్నిదిలో దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అనంతరం అన్నవితరణ నిర్వహించడం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కావున భక్తులు సహకరించగలరని ఈఓ నరేందర్ తెలిపారు.



శని అమావాస్యను పరస్కరించుకొని ముస్తాబౌతున్న ఎన్కతల శనైశ్వర ఆలయం

### విహెచ్ హనుమంత్ రావుకి అభినందనల వెల్లువ

**కూకట్‌పల్లి, మే 14, ప్రభాతవార్త**



వి.హనుమంతరావును కలిసిన రాష్ట్ర బీసీ నాయకులు

బీసీల సంక్షేమం అభివృద్ధి కోసం మంత్రివర్గ హోదాతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావుని పలు వురు కలిసి అభినందనలు తెలియజేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర బీసీ నాయ కులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, రాష్ట్ర బీసీ నాయకులు పోతుల రాజేందర్ పటేల్, రాకేష్ పటేల్, నరేందర్ రెడ్డి తదితరులు వి.హనుమంతరావును కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ బీసీ సమాజానికి దశా బ్దాలుగా అండగా నిలిచిన హనుమంత రావు అనుభవం, పోరాటం ఈ కొత్త బాధ్యతలో బీసీల అభివృద్ధికి మరింత ఊతమివ్వాలని ఆకాంక్షి స్తున్నామని అన్నారు. ఆయన సేవలు, సలహాలు తెలంగాణ బీసీల ఆత్మగౌరవాన్ని, సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరుకుం టున్నామనీ ఆశాభవం వ్యక్తం చేశారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట,మే 14 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ భవన నిర్మాణ దారులు



సెంట్రింగ్ నిర్మాణానికి చెల్లిస్తున్న రేట్ సరిపోవడం లేదని, వెంటనే సెంట్రింగ్ ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి సెంట్రింగ్ కాంట్రాక్టర్లు,కార్మికులు తలపెట్టిన బంద్‌ను విజ యవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని అడ్డగుట్ట కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు మల్లేశ్,రాములు తెలిపారు.గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా విడుదల చేసిన గోడ పత్రికను ఆఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికు లకు,సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. భవన నిర్మాణ దారులు చెల్లిస్తున్న రేట్ సరిపోవడం లేదని,వారు చేస్తున్న న్యాయమైన కోర్కెల సాధనకు ఎల్లప్పుడు తమ మద్దతు ఉటుందన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# మజీద్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



మజీద్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, తదితరుల దృశ్యం



మజీద్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్దిదారులతో పాల్గొన్న చైర్మన్, జిల్లాఆర్టీఏ మెంబర్, పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, నాయకులు తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, మే 14, ప్రభాతవార్త:** మజీద్‌పూర్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన రెండు ఇందిరమ్మ ఇళ్లను అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి ప్రారంభించారు. రెండు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను గృహప్రవేశం చేయించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్‌లో ప్రభుత్వం లబ్దిదారులు మైలారం అనురాధ-మల్లేశ్, అంతాయిపల్లి పోచమ్మ-బిక్షపతిలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయటంతో వారు సకాలంలో ఇళ్లను నిర్మించుకోవటంతో ఆమె పాల్గొని ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌లు, పలువురు కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగ వారు లబ్దిదారులను అభినందించారు.ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం ఇళ్లు లేని పేదలకు స్వంతింటి కళను నెరవేర్చటానికి ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు 5లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సామల జశ్వంత్‌రెడ్డి, సరసం వనజఅశోక్‌రెడ్డి, గూడె వెంకటేశ, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మున్సిపల్ బిసి సెల్ అధ్యక్షులు గిర్మాపూర్ నర్సింగ్‌రావుగౌడ్, వార్డు అధ్యక్షులు ఎన్.వెంకటయ్య, నాయకులు ఎ.భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ఎ.జగదీశ్వర్‌గౌడ్, కె.వెంకటేశ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ మీట్ అండ్ గ్రీట్

**జూబ్లీహిల్స్, మే 14, ప్రభాతవార్త:** యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ మీట్ గ్రీట్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. బంజారాహిల్స్‌లో గురువారం యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ మీట్ ద గ్రీట్ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ వైస్ ఛాన్సిలర్ జాన్ వాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత మూస కోర్సులు చదువుకునేందుకు ఇష్టపడటం లేదని ఎప్పటికప్పుడు సరికొత్త కోర్సులు చదువుకోవడానికి ఇష్టపడుతున్నారన్నారు. యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ యూనివర్సిటీకి భారతీయ విద్యార్థులకు మంచి సంబంధాలు ఉన్నాయని ఇక్కడ లభించే కోర్సులకు ప్రతియేటా భారతీయ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదన్నారు. టెక్నాలజీ కోర్సులు, సైబర్ సెక్యూరిటీస్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రొబోటిక్స్ వంటి ఎన్నో అంశాలపై అధునాతన కోర్సులను విద్యార్థులకు ఈ యూనివర్సిటీ అందిస్తున్నదని తెలిపారు. ఒక వైపు చదువుకుంటూనే మరో వైపు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నదని అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ అడ్మిన్ గులిని రిచర్డ్ మాట్లాడుతూ ప్రస్తుతం యూనివర్సిటీలో 12 వేల మంది విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని అన్నారు. సావరియా ఎడ్యుకేషన్ సంస్థ ఛైర్మన్ రాజేష్ గోయల్ మాట్లాడుతూ తొలుత 200 మంది తమ కన్సల్టెన్సీ నుంచి లండన్ వెళ్ళారని ఇప్పుడు 500 మందికిపైగా వెళ్తున్నారని అన్నారు.



మీట్ అండ గ్రేట్ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ వీసీ జాన్ వాల్..



రాహుల్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## రాహుల్‌కు అవార్డు ప్రదానం

**సైఫాబాద్, మే 14 ప్రభాతవార్త:** బాల్య వివాహాల నిర్మూ లన, బాలల హక్కులు, రక్షణ కోసం గత 15 సం వత్సరాలుగా విశేషంగా కృషి చేసిన సాధన స్వ చ్ఛంద సంస్థ కార్యని ర్వాహక అధ్యక్షుడు సిక్కు రాహుల్‌కు జీవ్రాన్ ఫౌండేషన ద్వారా 'విశ్వం౼త్న గౌరవ్ సమ్మాన్-2526' అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం నాడిక్కడ రాహుల్‌కు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ సాధన స్వచ్ఛంద ప్రారంభించి మూడు దశాబ్దాలు పూర్తి అయ్యం దని, తాను రాష్ట్రంలోని 5 జిల్లాలు మెదక్, కామారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో బాల్య వివాహాల నిర్మూలన, హింస, వేధింపులు, మానసిక ఆరోగ్యం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నిరక్షరాస్యత, బాలల అక్రమణ రవాణా, పేదరికంపై గత 15 సంవత్సరాలుగా విశేషంగా కృషి చేయడం జరిగిందన్నారు. తన సేవలకు గాను ఢిల్లీలోని జీవ్రాన్ ఫౌండేషన్ ద్వారా ఈ అవార్డు లభించిందన్నారు. భవిష్యత్తులో బాలలకు మరిన్ని సేవలు అందించాలనే ద ృక్పథంతో ఉన్నానని చెప్పారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

## తులం బంగారం ఇస్తామని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

**కెపిహెచ్‌బి కాలనీ, మే 14, ప్రభాతవార్త** ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని మాటలు చెప్పి ఆడపిల్లలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి సర్కిల్‌కు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో భాగంగా 151 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనాడు ఎంతో మానవతా దృక్పథంతో పేదింటి ఆడబిడ్డ పెళ్లయితే వారికి అండగా ఉండేదుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రారంభించారని కొనియాడారు. కాంగ్రెస్‌పార్టీ అబద్ధాలు హామీలు ఇచ్చి తులం బంగారం కూడా ఇస్తామని చెప్పి ఆడబిడ్డలను మోసం చేసిందని ఆరోపించారు. బి.ఆర్. ఎస్ హయాంలో దేశంలో ఎక్కడా లేనటువంటి రైతుబం ధు, రైతు బీమా మిషన్ భగీరథ, వంటి గొప్ప కార్యక్ర మాలు తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శమే కాకుండా దేశానికి ఆదర్శమయ్యాయని తిరిగి మళ్ళీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ప్రజలు ఎన్నుకుంటారని ఆ రోజులు దగ్గర లోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబీయా గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సిసిరోడ్డు పనులు.. స్థానికులకు తప్పని తిప్పలు

**బేగంబజార్,మే 14ప్రభాతవార్త:** మహానగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్వాకంస్థానిక ప్రజల పాలిట శాపంగా మారిందని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త ఆరోపించారు.బేగంబజార్ డివిజన్‌లోని సిబిఎస్ వెనుక బస్తీలో నూతనంగా సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.పనులు చేపట్టడం బాగానే ఉన్నప్పటికి,ప్రజలకు మాత్రం ఇబ్బందులు,తిప్పలు తప్పడంలేదన్నారు.స్థానికులు వెళ్లేందుకు ఒకటే దారి ఉందని,జీహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు రెండు వైపుల్లా ఒకేసారి సిమెంట్ రోడ్డు పనులను నిర్మించడం ద్వారా స్థానికులు తమ నివాసాలకు వెళ్లేందుకు గాను అనేక అవస్థలకు గురయ్యారు.ఒక వైపు వేసిన తరువాత మరో వైపు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా సిసి రోడ్డు బలంగా ఉంటుందన్నారు.స్థానికుల వినతి మేరకు ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టే స్థలానికి చేరుకుని పనులను,స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, పరిశీలించారు. స్థానికులకు ఉపయోగపడే సిసి రోడ్డు వారి పాలిట శాపంగా పరిణమించిందన్నారు.ముందు చూపులేకపోవడంతో ఇష్టానుసారంగా సిసిరోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.రెండువైపులా ఒకేసారి కాకుండా ఒక వరుస వేసిన తర్వాత మరో పక్క రోడ్డు నిర్మాణం చేట్టడం ద్వారా స్థానికులకు,ఇబ్బందులు కలుగకుండా ఉంటుందన్నారు.ఇంజనీరింగ్ అధికారులు పనులు జరుగుతున్న చోట అందుబాటు లో లేకపోవడం గమాన్వారం అన్నారు.



ఇష్టానుసారంగా వేస్తున్న సిసి రోడ్డు దృశ్యం

## జీటీఎస్ దేవాలయం అర్చకులు, సిబ్బందికి జీతల పెంపు

**యూసుఫ్‌గూడ మే 14 ప్రభాతవార్త :** జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప శ్రీ సాయిబాబా దేవస్థానంలో నిత్యం పూజలు నిర్వహించే పూజారులు, ఆలయంలో పనిచేసే సిబ్బందికి వారి నెలసరి జీతాలు పెంచటంతో ఆనందం వ్యక్తం చేశా రు. ఎన్నో ఏళ్లుగా తాము ఆలయ అభివృద్ధికి పనిచేస్తూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిత్య పూజలు జరిపిస్తున్న తమకు నెలసరి జీతాలు పెంచటంలో ఆల య కార్యనిర్వాహణా అధికారి డాక్టర్ గుమ్మడిదల సుధా కర్ ఎంతో కృషి చేశారని ఆయన కృషి వల్లనే తమకు జీతాలు పెరిగాయంటూ ఆలయం వద్ద శాలువులతో పూలతో ఘనంగా సత్కరించారు. ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్న జీటీఎస్ దేవాలయం 2017లో దేవాదాయ ధర్మా దాయశాఖ స్వీకరించిన తర్వాత ఆగస్టు 2024లో గుమ్మ డిదల సుధాకర్ కార్యనిర్వాహణాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆరోజు నుంచి భగవంతుకుని ప్రతి రోజు దూప దీప నైవేద్యము సక్రమంగా జరిగేలా చూస్తు న్నారని నిత్య నైవేద్యం, నిత్య అలంకారములు, అన్నదా నములు సక్రమంగా జరిగేలా చూస్తున్నారని పేర్కొ న్నారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించనప్పటి నుంచి భక్తులందరికీ మంచినీటి సౌకర్యం, అమ్మవారి నవరాత్రు ల కాలంలో అలంకారములు, పూజలను విశేషంగా నిర్వ హించటం జరుగుతుంది. దేవాలయం ఎండోన్‌మెంట్ అయిన తర్వాత 9 ఏళ్ల వరకు సిబ్బందికి తక్కవ జీతం తో పనిచేస్తున్న సిబ్బందికి ఎండోన్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సహకారంతో అందరికీ సమానంగా జీతాలు పెంచి అందివ్వడం జరుగుతుంది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ ఆలయ ప్రతిష్టతను కాపాడుతూ సిబ్బంది మన్ననలను పొందుతున్నారు.



దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణా అధికారి గుమ్మడిదల సుధాకర్‌ను ఘనంగా సన్మానిస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది.

## అర్హులైన వారికి ఇండ్ల పంపిణీ చేస్తాం

**: టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్**



ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు జాబితాను అందచేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్

**గన్‌ఫౌండ్రి,మే 14ప్రభాతవార్త:** ప్రజా పాలనలో గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ కోరారు.ఇందిరమ్మ ఇండ్లకోసం ధరఖాస్తు చేసుకున్న వారి జాబితాను అందచేయగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.వెంటనే ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తులను సంబంధిత అధికారులకుఅందచేయాలని సూచించారు.అర్హులైన వారికి ఇండ్లను అందే విధంగా చూస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.

## సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం

**సికింద్రాబాద్, మే 14 ప్రభాతవార్త:** దళిత సాధికారతే లక్ష ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంఘటన్ సృజన్ అభి యాన్ కార్యక్రమం సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో జరిగింది. ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భేటీకి ఉమ్మడి హైదరాబాద్ జిల్లా అబ్జర్వర్ హెచ్.ఆర్. మోహన్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం, ఎస్సీ విభాగం రాష్ట్ర, జిల్లా కమిటీల పునర్వ్యవస్థీకరణపై ఈ సందర్భంగా లోతుగా చర్చిం చారు.జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేలా జరిగిన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ సాయి మధుకర్ గౌరవఅతిథులుగా పాల్గొని ఆశావహులతో భేటీ అయ్యారు. జిల్లాస్థాయి పదవుల కోసం భారీగా పోటీ నెలకొనగా, సుమారు 30 మందికి పైగా అభ్యర్థులు తమ దరఖాస్తులను పరిశీలకులకు అందజేశారు. సమర్థులైన వారికే పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నేతలకు దీపక్ జాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే



యూసుఫ్‌నగర్‌లో శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ సబీహ్ గౌసుద్దీన్.

**యూసుఫ్‌గూడ మే 14 ప్రభాతవార్త :** దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చూకూరుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌నగర్ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారావుతో పాటు మాజీ కార్పొరేటర్ సబీహ్ గౌసుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ ఆలయాల పవిత్రను కాపాడుకునే విధంగా ఎప్పటికప్పుడు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోవటం ఆనందకరమైన విషయమని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నార్లపురం నాగరాజు, నరసింహాతో పాటు స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అబివృద్ధికి దాతలు ముందుకు రావాలి

**అడ్డగుట్ట,మే 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పాఠశాల భవనాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం అభినందనీయమని మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు సి.బద్రి నాథ్ యాదవ్,సి.వైష్ణవి యాదవ్, సంతోష్ యాద౼వ్‌లు తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆదేశాలమేరకు గురువారం మోండాడివిజన్ రెజిమెంటల్ బజార్ లోని ప్రభుత్వపాఠశాల భవన నిర్మాణానికి మహావీర్ ఇంటర్నెషనల్ హుడాన్ సంస్థ చేపట్టిన భూమి పూజ వేడుకల్లోవారు పాల్గొన్నారు. కోటి రూపాయల వ్యయంతో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి మహావీర్ ఇంటర్నెషనల్ హుడాన్ సంస్థను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మహావీర్ ఇంటర్నెషనల్ హుడాన్ ప్రాజెక్ట్ హెడ్ మహావీర్ లోహియ,ఛైర్ పర్సన్ అర్థి చొరలియా,తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో స్వచ్ఛంద రక్తదాన అవగాహన ర్యాలీ

**జూబ్లీహిల్స్, మే 14, ప్రభాతవార్త:** నిమ్స్‌లో ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్, ఇమ్యునోహిమటా లజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛంద రక్తదా న అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప జెండా ఊపి ర్యాలీని ప్రారంభిం చారు. ఎమర్జెన్సీ గేట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పంజాగుట్ట గేట్ వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ, రక్తదానం ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మాన్ని యూ బ్లడ్ అప్" వ్యవస్థాపకులు జగదీష్ బాబు యలమంచిలి సహకారంతో నిర్వహించారు. నిమ్స్‌కు తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సహకారం అందించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. నమోదు చేసిన రక్తదాతలను సమీకరించి నేరుగా సంస్థకు అను సంధానం చేసే విధంగా సాంకేతిక సహకారం అందిస్తా మన్నారు. దీని ద్వారా రక్త యూనిట్ల సరఫరా మరింత స్థిరంగా, సమర్థవంతంగా మారే అవకాశం ఉందని తెలిపారు.అవగాహన కార్యక్రమంలో ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్, ఇమ్యునోహిమటాలజీ విభాగ అధ్యాపకులు రక్తదాన అవసరం, ప్రాముఖ్యత, సామాజిక బాధ్యతపై ప్రసంగించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ హెచ్‌ఓడీ డా. సుదీర్ వుజ్జిని, డా. కె. మహేష్, డా. బి. శాంతి, డా. మార్త రమేష్, మీడియా రిలేషన్ అధికారి సత్యగౌడ్, అలైడ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఫిజియోథెరపీ, ఎంహెచ్‌ఎం, నర్సింగ్, అలైడ్ సైన్స్ విద్యార్థులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, యూ బ్లడ్ అప్ బృంద సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ నగరి బీరప్ప, పాల్గొన్న వైద్యులు, నర్సులు.

## ప్రేమ్‌నగర్‌లో కల్లు కాంపౌండ్‌కు వ్యతిరేకంగా భారీ ధర్నా

**జూబ్లీహిల్స్, మే 14, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్ ప్రాంతంలో కల్లు కాంపౌండ్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక మహిళలు, యువకులు భారీ స్థాయిలో ధర్నా నిర్వహించారు. చింతల్‌బస్తీ నుంచి సాయిబాబా గుడి రోడ్డులో ఏర్పాటు చేస్తున్న కల్లు కాంపౌండ్ కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రహదారి ఆనంద్‌నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రజలకు ప్రధాన మార్గమని, కల్లు కాంపౌండ్ వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతోం దని స్థానికులు తెలిపారు. వెంటనే కల్లు కాంపౌండ్‌ను నిలిపివే యాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని స్థానిక ప్రజలకు మద్దతు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సీనియ ర్ నాయకుడు, మాజీ చైర్మన్ విప్లవ్ కుమార్ కూడా ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, నవీన్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్, శివరాజ్, నరేష్ తదితర స్థానిక నాయకులతో పాటు మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కల్లు కాంపౌండ్ ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న స్థానికులు




## బడిబాటతో విద్యాభివృద్ధికి బాటలు

**ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల పెంపుపై ప్రత్యేక దృష్టి..**

**మొయినాబాద్, మే 14, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు మండలవిద్యా అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం గురువారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రతి చిన్నారి చదువుకు దూరం కాకుండా చూడాలని, ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించడం, చిన్నారుల్లో విద్యపై ఆసక్తి పెంచడం బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ విద్య ప్రాముఖ్యతపై ప్రజలకు సందేశాలు ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని అధికారులు కోరారు.

## విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మానం

**చేవెళ్ల, మే 14, ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఊరెళ్ళలో ఈరోజు విద్యా వారోత్సవాలు మరియు బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు అందరూ కలిసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పదవ తరగతి పబ్లిక్‌పరీక్షలను ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు కలిసి ఘనంగా సన్మానించారు. 551 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన కరికె నవ్య శ్రీ, 538 మార్కుల తో అరుబా ద్వితీయ స్థానంలో, 532 మార్కులతో సమీరా తహసిన్ తృతీయ స్థానంలో, 513 మార్కులతో శ్రీ తేజ నాలుగవ స్థానంలో, 504 మార్కులతో సంజన ఐదవ స్థానంలో నిలిచారు. అలాగే 400కు పైగా 16 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. వీరందరికీ పాఠశాల తరఫున శాలువా మరియు మొమెంటోతో సత్కరించారు. గణతంత్ర దినోత్సవము రోజు ఇచ్చిన మాట ప్రకారం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కర్నె శివప్రసాద్ 500 పైన మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులందరికీ నగదు పురస్కారాన్ని అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన నవ్యశ్రీకి రూ.6వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన అరుబాకు రూ.4వేలు, తృతీయ స్థానంలో నిలిచిన సమీరాకు రూ.3వేలు,, నాలుగవ మరియు ఐదవ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.2వేలు, చొప్పున నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఊరెళ్ళ రెండవ వార్డ్ కౌన్సిలర్ సువర్ణ చందు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. గ్రామ మాజీ సర్పంచ్ జహంగీర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒత్తిడి లేకుండా మంచి గుణాత్మక విద్యను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియ మొదలైందని తెలుపుతూ ప్రభుత్వం తలపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఊరెళ్ల మొదటి వార్డు కౌన్సిలర్ దూత మల్లేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే యాదగిరి, ఉపాధ్యాయులు కృష్ణ ప్రకాష్ రెడ్డి, మహమ్మద్ అక్బర్, రాఘవేందర్, నర్మదా, ప్రసన్న లక్ష్మి, వల్లి కుమారి, ప్రవీణ్, వెంకటేష్, శేఖర్, సునీత లతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ బాలమణి, గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కొడంగల్ రూరల్, మే 14 (ప్రభాతవార్త):** ప్రభుత్వ మద్దతు ధర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి శ్రీలత అన్నారు. గురువారం కొడంగల్ మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసు కున్నారు. ధాన్యం తీసుకొచ్చే రైతులను నిర్వా హకులు ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. తేమ శాతం, సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, యాదప్ప, రైతులు పాల్గొన్నారు.

## ఒకే వర్గానికి ఇళ్లు కేటాయించడం అన్యాయం

**శంకర్‌పల్లి మే 14, ప్రభాతవార్త :** ఒకే వర్గానికి ఇళ్ల కేటాయింపులు అన్యాయం, వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. నిజమైన లబ్దిదారులకు స్థలం లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం కేటాయించాలని డిమాండ్ చేశారు. శంకర్ పల్లి పట్టణంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుల విషయంలో వివాదం నెలకొన్న విషయం విధితమే. ఇళ్లను ప్రత్యేకంగా ఒక కాంగ్రెస్ పార్టీ వర్గానికి కేటాయించడం చట్టవిరుద్ధం మరియు అప్రజాస్వామికమని ఆరోపిస్తూ గురువారం శంకర్‌పల్లి మండలపరిధిలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈ కేటాయింపుల కారణంగా పట్టణ ప్రజలు అయోమయానికి గురయ్యారని, అందరికీ సమానంగా లభించాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఒకే వర్గానికి పరిమితం చేయడం సరైందికాదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవ హరించి అర్హులైన పేదలకు ఇల్లు కేటాయించాలని అన్నారు. కాబట్టి ఇప్పటివరకు ఇచ్చిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.


ప్రవీణ్ కుమార్ మాదిగ
ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు


కొండకల్ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## కొండకల్‌లో బడిబాట

**శంకర్‌పల్లి, మే 14, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామం పురవీధుల గుండా భారీర్యాలీ నిర్వహించి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు.


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న నాయకులు

## ఇందిరమ్మ పథకంతో సాకారమైన సొంతింటి కల..

**దుద్యాల్, మే 14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, ఎస్టి సెల్ మండల ప్రెసిడెంట్ రవి నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఈర్లపల్లిలో రాసూరి లావణ్య, రవికుమార్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్ మొగులయ్య, పంచాయితీ కార్యదర్శి సూర్యప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మాణిక్య నాయక్, సంతోష్ నాయక్, పెంటప్ప నాయకులు నరసింహులు నాయుడు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలపై అధికారుల దృష్టి

**-బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకుందాం**
**- అన్ని వర్గాలకు కొత్తూరు పోలీసుల సూచనలు**

**కొత్తూరు, మే 14, ప్రభాతవార్త:** రానున్న బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కొత్తూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ నర్సయ్య గురువారం శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో స్థానిక తహసీల్ముదార్ ముస్లిం మత పెద్దలు, ఖురేషీ కమ్యూనిటీ సభ్యులు, హిందూ వాహిని, బజరంగ్ దళ్ నాయకులు, హిందూ యువకులు, పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, స్థానిక అధికారులు పాల్గొని ప్రభుత్వ తాజా మార్గదర్శకాలను వివరించారు. పండుగ సమయంలో సామాజిక సౌహార్దాన్ని కాపాడాలని, వధ స్థలాల వద్ద పరిశుభ్రత పాటించాలని, గోవధ చేయరాదని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా, పశువులను తరలించే వాహనాలను అడ్డుకోవడం లేదా దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న అన్ని వర్గాల ప్రతినిధులు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ, బక్రీద్ పండుగను శాంతియుతంగా


సమావేశంలో పలు సూచనలు చేస్తున్న పోలీసులు

## తాళ్లపల్లి-నాగర్‌గూడ గ్రామపంచాయతీ మధ్య / వివాదాస్పద భూముల పరిశీలన

**జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్**

**షాబాద్, మే 14, ప్రభాతవార్త :** తాళ్లపల్లి, నాగర్‌గూడ గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న రెవెన్యూ సర్వే నెంబర్లకు సంబంధించి రెండు గ్రామాల మధ్య కొనసాగుతున్న వివాదాస్పద భూములను జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సర్వే నంబర్ల భూవివాదాలపై పూర్తిస్థాయి వివరాలను సేకరించి, పరిశీలించిన నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని తెలిపారు. గ్రామపంచాయతీల మధ్య సరిహద్దు వివాదాలు, సర్వే నంబర్ల పరిధి నిర్ధారణ, భూ యాజమాన్య అంశాలపై స్పష్టత కోసం తాళ్లపల్లి, నాగర్‌గూడ గ్రామాలకు జిల్లా పంచాయతీ అధికారి స్వయంగా చేరుకొని పరిశీలన చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో భూముల స్థితిగతులపై సర్వేయర్ ద్వారా వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అపర్ణ, డీఎల్పీఓ, ఎంపీవో నరసరయ్య , సీఐ కాంత రడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, తాళ్లపల్లి, నాగర్‌గూడ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మేడ్చల్ ప్రజలు సమస్యలను వెంటనే పరిష్కరించండి

**మేడ్చల్, మే 14, ప్రభాతవార్త :** మేడ్చల్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ గారు సిఎంసి కమిషనర్ సృజనకు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ హౌసింగ్ బోర్డ్ కాలనీ నుండి లైబ్రరీ వరకు సుమారు 300 మీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ఈ రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ రోడ్డును నూతన సీసీ నిర్మించి బాగు చేయాలని కోరారు. అదే విదంగా మాజీ సర్పంచ్ దేవేందర్ రెడ్డి ఇంటి నుండి ముదిరాజ్ సంఘం వరకు ఉన్న సుమారు 250 మీటర్ల రోడ్డును అభివృద్ధి చేసి సీసీ రోడ్ వేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ పట్టణంలోని కాలనీలల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి కాలనీలో సరైన శానిటేషన్ నిర్వహణ ఉండేలా చూడాలని, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, రోడ్లలో గుంతలను ప్యాచ్ వర్క్ చేసి త్వరితగతిన పూర్తి చేసి ప్రజ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.


సిఎంసి కమిషనర్ సృజనకు వినతి పత్రం అందజేస్తున్న మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్

## గ్రీన్‌ఫీల్డ్ కాలనీ భూ సమస్యను పరిష్కరించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 14, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అల్వాల్-ఖానాజిగూడలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీకి సంబంధించిన భూ సమస్యను సంబంధిత రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసిషియేషన్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు ఎస్.జ్ఞానేశ్వర్, కె.శ్రీనివాస్‌రెడ్డిలు కోరారు. అధికారులు స్పందించకుంటే ఈ కాలనీలో అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగే అవకాశం ఉందని వారు అన్నారు. గురువారం వారు మేడ్చల్ జిల్లా విలేకరులకు ఆ భూ సమస్యను వివరించారు. ఈ భూముల్లో అల్వాల్ మున్సిపల్ అధికారులు నాలుగు ఇళ్లకు అక్రమంగా పర్మిషన్‌లు ఇచ్చారని అన్నారు. తాజాగ ఖానాజీగూడ,పద్మావతినగర్‌కు చెందిన యుఎల్‌సి పరిధిలోని ప్లాట్లకు సర్వే నెంబర్లు మారుస్తూ వారు అనుమతులు ఇచ్చారని ఇదీ ఎంత వరకు సబబు అని అన్నారు. జిల్లా సంబంధిత అధికారులు ఈ భూములపై దృష్టి సారించాలని వారు కోరారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.


బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

## సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య..

**దుద్యాల్, మే 14, ప్రభాతవార్త:** సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య అందుతుందని దుద్యాల్ మండల విద్యాధికారి గండె శంకర్ అన్నారు. మండల వ్యాప్తంగా "బడిబాట" కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. హకీంపేట్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే ఉచిత పుస్తకాలు, పౌష్టికాహారం మరియు డిజిటల్ బోధన గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందని అందువల్ల ఉత్తమఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల ముఖాల్లో చిరునవ్వులు


ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా

**కొత్తూర్, మే 14, ప్రభాతవార్త:** పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా పేర్కొన్నారు. కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దయానంద్ గుప్తా మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలు గౌరవప్రదమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఇంటి ఆడపడుచులకు సారె అందజేసి సర్పంచ్ దయానంద్ గుప్తా శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇళ్లలో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్, ఉపసర్పంచ్ మీసాల ఆరోగ్యం, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇల్లు కాలిన కుటుంబానికి రాఘవేందర్ గౌడ్ చేయూత

**మేడ్చల్, మే 14, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని వెంకట్రాంరెడ్డి కాలనీలో నివాసముంటున్న కడమంచి లక్ష్మణ్ గుడిసె ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమా దంలో ఇంట్లో ఉన్న సామాగ్రి మంటల్లో కాలిపోవడంతో కుటుంబ సభ్యులు నిరాశ్రయులుగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత రామన్నగారి రాఘవేందర్ గౌడ్ మానవతా దృక్పదంతో స్పందించారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకుని వారిని నిత్యావసర సరుకులతో పాటు గుడిసే వేసుకోవడానికి గాను రూ 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన చేసిన సహాయానికి స్థానికులు అభినందించారు.


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న రాఘవేందర్ గౌడ్

## విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

**-విద్యా వారోత్సవాలతో తెలంగాణ విద్యా రంగానికి నూతన దిశ**
**-విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది : రిషికేష్ రెడ్డి**

**కొత్తూరు మే 14, ప్రభాతవార్త:** విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం మామిడి రిషికేష్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి సమగ్ర మార్పు తీసుకురావడానికి ప్రజాప్రభుత్వం ప్రారంభించిన విద్యావారోత్సవాలు కార్యక్రమాన్ని కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన జవహర్ బాల్‌మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రిషికేష్ రెడ్డి హృదయపూర్వకంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా అభివృద్ధి కోసం 1,700 కోట్లు కేటాయించాలని తీసుకున్న నిర్ణయం ప్రభుత్వం ప్రతి విద్యార్థికి నాణ్యమైన, సమగ్ర విద్య అందించాలనే దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న పలు విద్యా సంస్కరణలను జవహర్ బాల్ మంచ్ తెలంగాణ అభినందించింది. ముఖ్యంగా విద్యార్థుల కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడం, రాష్ట్రవ్యాప్తంగా 125 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో సుమారు 2,500 మంది విద్యార్థులు క్లాస్ 12 వరకు నివాస విద్యను అభ్యసించే అవకాశం కల్పించడం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పుకు దారితీస్తుందని తెలిపారు. అలాగే విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎసెన్షియల్ స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయడం, విద్యా శాఖలో 11,000 కొత్త ఉపాధ్యాయుల నియామకం, సుమారు 36,000 ఉపాధ్యాయుల బదిలీలను విజయవంతంగా పూర్తి చేయడాన్ని సంస్థ స్వాగతించింది. రాష్ట్రంలోని సుమారు 1,05,000 ప్రభుత్వ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, విద్యాసంస్థల్లో తగినంత నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలనే నిర్ణయం హర్షణీయమన్నారు. విద్యా వరోత్సవాలు కార్యక్రమంలో భాగంగా జవహర్ బాల్ మంచ్ తెలంగాణ సక్రియంగా పాల్గొంటుందని మామిడి రిషికేష్ రెడ్డి వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు సేకరించి వాటిని ప్రభుత్వానికి సమర్పించి తెలంగాణ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో తమ వంతు పాత్ర పోషిస్తామని తెలిపారు. ఈ ప్రగతిశీల విద్యా సంస్కరణలు, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు భవిష్యత్తుకు సిద్ధమైన బలమైన తెలంగాణ నిర్మాణానికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


విద్యా వారోత్సవాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

## ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**కొత్తూరు మే14,ప్రభాతవార్త :**

విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తూరు మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కొత్తూరు పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగూర్ నాయక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు మాట్లాడుతూ, పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్యావారోత్సవాల్లో భాగంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టి, ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఉచిత సదుపాయాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలతో సమర్థవంతంగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, శ్రీనివాసులు, భగవంతు రాజు, సుజాత, నవనీతతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

**సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య**

**షాబాద్, మే 14, ప్రభాతవార్త :** ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య పేర్కొన్నారు. ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ బడిల్లో చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నారని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ టీచరుతో పాటు ఓ విద్యావాలంటీరుతో సహా ఆయాను సైతం ప్రభుత్వం నియమించిందని చెప్పారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పాఠశాలలో త్వరలోనే సుందరీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్పిటిసి సభ్యులు కుమ్మరి చెన్నయ్య, ప్రధానోపాధ్యాయులు ఎం.ఎల్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ నర్సమ్మ, వార్డు సభ్యులు సత్తయ్య, నాయకులు శివరాములు, అంజిరెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరం

**జవహర్ నగర్,మే 14.ప్రభాత వార్త:** జవహర్‌నగర్‌లో ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో జెడీ ఏ. ఉషారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్ (పిటిఎం) కార్యక్రమాన్ని పరిశీలించిన ఆమె, విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో ముందుకు సాగి మంచిఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ జవహర్ నగర్ పాఠశాలను సందర్శించిన ఉషారాణి, సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న విద్యార్థులు మరియు ఎస్ఎస్‌సి ఫెయిల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న రెమిడియల్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాసన నైపుణ్యాలు, ప్రతిభను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహులు, ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ అజముద్దీన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

## బడిబాటలో విద్యార్థులతో ర్యాలీ

**శామీర్‌పేట, మే 14, ప్రభాతవార్త:** తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌళిక వసతులు,సదుపాయాల గురించి వివరించారు. విద్యార్థులు అందరు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా చొరవ తీసుకోవాలని అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఆ తరువాత తూంకుంటలోని వివిధ బస్తీల్లో, వీధుల్లో విద్యార్థులతో ర్యాలీగ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సహకరించాలని ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.తిరుమలేశ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, రాంబాబు, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

